సాక్షి
పశ్చిమగోదావరి

శనివారం । 3 । ఆగస్టు । 2024



పుస్తకాల పంపిణీలో తీవ్ర జాప్యం
విద్యా సంవత్సరం ప్రారంభమైన రెండు నెలల తర్వాత ప్రభుత్వం తాపీగా ఇంటర్ విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేస్తోంది. 8లో ▸



ఉచిత న్యాయ సహాయం
ఖైదీల కుటుంబ సభ్యులకు ఉచిత న్యాయ సాయం అందిస్తామని ఉమ్మడి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రత్నప్రసాద్ తెలిపారు. 8లో ▸



అడుగుకో గుంత..
జిల్లాలోని ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ రోడ్లు అధ్వానంగా మారడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 8లో ▸

పేరుకే ఉచితం.. బాదుడు అధనం

ఇసుక కష్టాలు
- జిల్లావాసులకు రవాణా, లోడింగ్, అదనపు చార్జీల భారం
- స్టాక్ పాయింట్ల వద్ద వెయిటింగ్ చార్జీలూ భరించాల్సిందే..
- గతంలో కన్నా లారీకి రూ.5 వేల వరకూ పెరిగిన ధర
- బెంబేలెత్తుతున్న గృహ నిర్మాణదారులు
- మరో నాలుగు నెలలపాటు తప్పని వెతలు



తూర్పుగోదావరి జిల్లా పందలపర్రు స్టాక్ పాయింట్ వద్ద బారులు తీరిన లారీలు



సాక్షి, భీమవరం: ఉచితం.. ఉచితం అంటూ ఊదరగొట్టిన ఇసుక వినియోగదారులకు చుక్కలు చూపిస్తోంది. గతంతో పోలిస్తే ఆరు యూనిట్ల లారీకి రూ.3 వేల నుంచి రూ.5 వేల వరకు ధర పెరగడంతో పాటు సకాలంలో అందని పరిస్థితి నెలకొంది. మరోపక్క దొడ్డిదారిన తెలుగు తమ్ముళ్లకు కాసుల వర్షం కురిపిస్తోంది.

పొరుగు జిల్లాల నుంచే.. జిల్లాలో ఇసుక స్టాకు పాయింట్లు లేకపోవడంతో తూర్పుగోదావరి జిల్లాలోని పెండ్యాల, తీపర్రు, డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని రావులపాలెం నుంచి ఇక్కడకు తెచ్చుకోవాల్సి వస్తుంది. ఎన్నికల ముందు స్టాక్ పాయింట్ల వద్ద అవినీతి కొండలంటూ కూటమి నాయకులు సెల్ఫీలు దిగి ప్రచారం చేశారు. అధికారంలోకి రాగానే రాత్రికి రాత్రి కొండలను కరిగించేశారు. అధికారులు పాత స్టాకు రికార్డుల జోలికి వెళ్లకుండా తూతూమంత్రంగా ఉన్న స్టాకులే లెక్కలు కట్టి ప్రకటించారు. ఈ రికార్డుల ప్రకారం తూర్పుగోదావరి జిల్లాలోని పందలపర్రు స్టాక్ పాయింట్ వద్ద 52,082 టన్నులు, పెండ్యాలలో 1,46,249 టన్నులు, ఉసులుమర్రులో 33,065 టన్నులు, కోనసీమ జిల్లా రావులపాడు-1లో 34,171 టన్నులు, రావులపాడు-2లో 82,950 టన్నులు, కొత్తపేట కేంద్రంలో 25,897 టన్నుల ఇసుక నిల్వలు ఉన్నాయి.

తగ్గిన పరిమాణం : లారీలోని ఇసుక పరిమాణం కూడా తక్కువగానే ఉంటుంది. గతంలో 5 యూనిట్లకు పైగా ఇసుక వినియోగదారుడు చెంతకు చేరేది. ప్రస్తుతం 20 టన్నులు ఎగుమతి చేస్తుండటంతో కేవలం 4.5 యూనిట్లు మాత్రమే వినియోగదారుడు చెంతకు చేరుతుంది. గతంలో కన్నా అర యూనిట్ ఇసుక తక్కువగా వస్తుండటంతో నిర్మాణదారుల జేబుకు చిల్లుపడినా లాభం లేకుండా పోతుంది. జిల్లాలోని ఆచంట, పెనుగొండ మండలాల్లో ఆరు ఓపెన్ రీచ్‌లు ఉన్నాయి. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా మరో నాలుగు నెలలపాటు జిల్లా ప్రజలకు ఇసుక కష్టాలు తీరేట్టే లేవు. ఇటీవల వచ్చిన వరదలతో గోదావరి నీరు బాటలను ముంచెత్తింది. వరద నీరు తగ్గడానికి నవంబర్ వరకూ సమయం పట్టే అవకాశం ఉంది.

వరదతో ఆగిన దందా
అధికారంలోకి రావడమే తరువాయి అధికార పార్టీ నాయకులు అక్రమ తవ్వకాలకు తెరలేపారు. ఆచంట నియోజకవర్గంలో ఆచంట మండలంలోని ర్యాంపు నుంచి స్థానిక ప్రజాప్రతినిధి భర్త ట్రాక్టర్లతో పెద్ద ఎత్తున ఇసుకను అక్రమంగా తరలించేశారు. అధికార పార్టీ నేత కావడంతో స్థానిక అధికారులు చూసీచూడనట్టుగా వ్యవహరించారు. ఉన్నతాధికారుల దృష్టికి ఫిర్యాదులు రావడం, మరో పక్క వశిష్ఠ గోదావరికి వరదలు రావడంతో ప్రస్తుతానికి అక్రమ తవ్వకాలకు బ్రేక్ పడింది.

రూ.5 వేల వరకు పెంపు
ఇసుక ఉచితం కాగా లోడింగ్, రవాణా, సీనరేజ్, జీఎస్టీ ఖర్చులు వినియోగదారులు భరించాల్సి ఉంది. ఆయా స్టాకు పాయింట్ల వద్ద 20 టన్నులు రూ. 4,900లకు అమ్మకాలు చేస్తున్నా జట్టు కూలీలు, ఇతర కూలీలు అంటూ అదనంగా రూ.500 నుంచి రూ.800 వరకూ వసూలు చేస్తున్నారు. దీంతో 4.5 యూనిట్ల లారీకి రూ.5,400 నుంచి రూ. 5,700 వరకు స్టాకు యార్డుల వద్ద చెల్లించాల్సిన పరిస్థితి. ఒక్కో లారీ లోడింగ్‌కు రెండు రోజుల వరకు సమయం పడుతుండటంతో డ్రైవర్, క్లీనర్ భోజన ఖర్చులు, బేటాల రూపంలో నిర్వహణ వ్యయం పెరుగుతోంది. దీంతో వెయిటింగ్ చార్జీల భారాన్నీ గృహ నిర్మాణదారులే భరించాల్సి వస్తుంది. పేరకు ఉచితమే అయినా ఆయా రూపాల్లో అదనపు బాదుడుతో ఇసుక ధర పెరిగిపోతోంది. గతంలో జిల్లాలోని ఆచంట నియోజకవర్గానికి ఆరు యూనిట్లు లారీ రూ.11,500, పాలకొల్లుకు రూ.13 వేలు, భీమవరం ప్రాంతానికి రూ.16 వేలు, ఆకివీడుకు రూ.18 వేలు, అత్తిలికి రూ.16 వేలు వరకు ఉండేది. ప్రస్తుతం లారీకి రూ.4 వేల నుంచి రూ.5 వేల వరకు అదనంగా చెల్లించాల్సి వస్తోందని వినియోగదారులు అంటున్నారు.

రాత్రి వేళల్లో అక్రమ తరలింపు
ఇసుక నిల్వలు అధికార పార్టీ నాయకులకు వరంలా తయారయ్యాయి. ఉదయం ఆరు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు మాత్రమే స్టాక్ పాయింట్ల నుంచి ఇసుక తీసుకువెళ్లేందుకు అనుమతి ఉంది. కాగా రాత్రి వేళల్లో గుట్టుచప్పుడు కాకుండా ఇసుకను తరలించేస్తున్నట్టు తెలుస్తోంది. ముందుగానే ఇసుక బ్రోకర్లతో మాట్లాడుకుని బిల్లులు లేకుండా 5 యూనిట్లు రూ.7,500 నుంచి రూ.8 వేలకు అమ్మకాలు చేస్తున్నారు. గంటలోపే లోడింగ్ చేసేలా ఏర్పాట్లు చేయడంతో లారీల యజమానులు సైతం మొగ్గుచూపుతున్నారు. తెల్లవారేసరికి రెండు మూడు ట్రిప్పులు వేసే అవకాశం ఉండటంతో తెగ తోలేస్తున్నారని సమాచారం.

నిర్మాణ పనులు నిలిచాయి


ఇసుక సరఫరా లేక షెడ్డు నిర్మాణ పనులు 20 రోజులుగా నిలిచిపోయాయి. తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని స్టాక్ పాయింట్ నుంచి నాలుగు రోజుల క్రితం 6 యూనిట్ల లారీ ఇసుక రూ.21 వేలకు కొన్నాను. లోడింగ్‌కు వెళ్లిన లారీలు రోజుల తరబడి స్టాక్ పాయింట్ల వద్ద వేచి ఉండటంతో లారీ యజమానులు రోజువారీ కిరాయిలను కలుపుకుని వినియోగదారుల నుంచి వసూలు చేస్తున్నారు. దీంతో ఇసుక ధరలు భారంగా మారాయి. వినియోగదారులకు అందుబాటులో ఉండేలా ఇసుక విధానాన్ని అమలు చేయాలి.
– దిరిశాల మునేశ్వరరావు, వినియోగదారుడు, అత్తిలి

ఇసుక దొరక్క.. పనులు లేక..


ఇసుక కొరత వలన పనులు లేక ఇబ్బందులు పడుతున్నాం. కొందామన్నా ఇసుక మాకు దొరకడం లేదు. బ్లాక్ మార్కెట్‌లో వేలకు వేలు రేట్లు చెబుతున్నారు. దీంతో భవన యజమానులు పనులు నిలిపివేశారు. దీని వలన మాకు సక్రమంగా పనులు ఉండటం లేదు.
– ఎం.వెంకన్న, తాపీమేస్త్రి, మేడపాడు

న్యూస్‌రీల్

సూపర్ సిక్స్ అమలుపై స్పష్టత ఏదీ?


మాట్లాడుతున్న సీపీఎం కార్యదర్శివర్గ సభ్యుడు మంతెన సీతారాం

జంగారెడ్డిగూడెం: చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు సూపర్‌సిక్స్ అమలుపై స్పష్టత ఇవ్వాలని, కేంద్రంతో పోరాడి రాష్ట్రానికి నిధులు సాధించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు మంతెన సీతారాం డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక రోటరీ హాల్ కల్యాణ మండపంలో సీపీఎం జిల్లా విస్తృత సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా సీతారాం మాట్లాడుతూ పథకాల పేర్లను మాత్రమే మార్చారని, విధివిధానాలు ప్రకటించి హామీల అమలుకు చర్యలు చేపట్టాలని కోరారు. చాలా చోట్ల స్కీం వర్కర్లు, చిన్న ఉద్యోగులపై అధికార పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు వేధింపులకు గురిచేయడం, ఉద్యోగాల నుంచి తొలగించే చర్యలకు చేపట్టడం దారుణమని విమర్శించారు. చిరుద్యోగులపై వేధింపులు ఆపాలన్నారు. విభజన చట్టంలోని హామీలు, రాష్ట్రానికి ప్రత్యేక హోదాపై కేంద్రంతో పోరాడాలన్నారు. రాష్ట్ర రాజధానికి కేంద్రం రూ.15 వేల కోట్ల అప్పు ఇస్తే అది రాష్ట్ర అప్పుగా మిగిలిపోతుందని విమర్శించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ ఏజెన్సీ, ఎర్రకాలువ భూ సమస్యలు పరిష్కరించి, పేదలకు భూ పంపిణీ చేయాలన్నారు. పి.కిషోర్, మొడియం నాగమణి, ఎం.జీవరత్నం అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. జిల్లా నాయకులు డీఎన్‌వీడీ ప్రసాద్, జి.రాజు, తెల్లం రామకృష్ణ పాల్గొన్నారు.

యానాదులకు మెరుగైన జీవన విధానం
భీమవరం: జిల్లాలోని యానాది కుటుంబాలకు మెరుగైన జీవన విధానం కల్పించే దిశగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో హౌసింగ్, మున్సిపల్ కమిషనర్ తదితరులతో ఆమె సమీక్షించారు. జిల్లాలో యానాదులు ఎక్కడ నివసిస్తున్నా గుర్తించి ఇళ్లు లేకుంటే నమోదు చేయాలన్నారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా మరుగుదొడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలన్నారు. తాడేపల్లిగూడెంలోని జగన్నాథపురం, పాలకోడేరులోని మోగల్లు, వీరవాసరం ఎస్టీకాలనీ తదితర ప్రాంతాల్లోని యానాదులపై దృష్టి పెట్టాలన్నారు.

విశ్వకర్మ యోజనపై..
ప్రధానమంత్రి విశ్వకర్మ యోజనను అన్ని వర్గాల ప్రజలకు అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్‌లో పీఎం విశ్వకర్మ పథకంపై ఆమె సమీక్షించారు. పథకానికి గుంపగుత్తగా దరఖాస్తులు వస్తే క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి చర్యలు చేపట్టాలన్నారు. పథకంలో భాగంగా జిల్లాలో శిక్షణ పొందిన వారు, బ్యాంకు రుణాల మంజూరు తదితర విషయాలపై సమీక్షించారు.

ట్రిపుల్‌ఐటీ విద్యార్థులకు నైపుణ్య శిక్షణ


అధికారులతో చర్చిస్తున్న ఎన్ఎస్ఐసీ ప్రతినిధులు

నూజివీడు: ట్రిపుల్‌ఐటీ విద్యార్థులకు పరిశ్రమ నైపుణ్యాలను తెలియజేయడంతో పాటు తమ సంస్థ ద్వారా శిక్షణ ఇస్తామని నేషనల్ స్మాల్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్ (ఎన్ఎస్ఐసీ) హైదరాబాద్ బృంద సభ్యులు అన్నారు. స్థానిక ట్రిపుల్ ఐటీని శుక్రవారం ఎన్ఎస్ఐసీ బృందం సందర్శించింది. జీఎం ఎన్‌కే సుబ్రమణి, డిప్యూటీ మేనేజర్లు టి. ముత్తుకుమారన్, అబ్దుల్ ఖాదర్‌ల బృందం క్యాంపస్‌లో పలు విభాగాలకు చెందిన ల్యాబ్‌లను పరిశీలించారు. పరిశ్రమలకు అవసరమైన స్కిల్స్‌పై చర్చించారు. విద్యార్థులకు శిక్షణతో పాటు కేంద్ర ప్రభుత్వం ద్వారా సూక్ష్మ పరిశ్రమల స్థాపన కోసం తోడ్పాటు అందిస్తామన్నారు. డైరెక్టర్ ఆచార్య ఎం.చంద్రశేఖర్ మాట్లాడుతూ సంస్థ ఇచ్చే శిక్షణ కార్యక్రమాల గురించి హెచ్‌ఓడీల ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పిస్తామన్నారు. డీన్ అకడమిక్స్ రత్నాకర్, అసోసియేట్ డీన్ అకడమిక్ జ్యోతీలాల్ నాయక్, ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ శ్రావణి, హెచ్‌ఓడీలు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలకు కృషి
ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): విద్యార్థుల్లో ఉపయుక్తమైన అభ్యసనా ఫలితాలు సాధించడానికి ఉపాధ్యాయులంతా కృషి చేయాలని డీఈఓ ఎస్. అబ్రహం సూచించారు. శుక్రవారం ఈదర సుబ్బమ్మదేవి హైస్కూల్‌లో ఉమ్మడి పరీక్షల నిర్వహణ సంస్థ ఆధ్వర్యంలో 10వ తరగతి నూతన పాఠ్యపుస్తకాలపై ఉపాధ్యాయులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 300 మంది ఇంగ్లిష్ ఉపాధ్యాయులు హాజరయ్యారు.

మర్యాదపూర్వక భేటీ



జగన్‌ను కలిసిన మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ మర్యాదపూర్వకంగా కలిశారు. వర్షాలు, వరదలతో తాడేపల్లిగూడెం మండలంలో ఎర్రకాలువ ముంపు సమస్యను జగన్ దృష్టికి తీసుకువెళ్లారు. వైఎస్సార్‌సీపీ రైతులకు అనుకూలంగా ఉంటుందని, తక్షణమే రైతులను ఆదుకోవాలని కూటమి ప్రభుత్వాన్ని కోరుతున్నట్టు జగన్ తెలిపారు. అనంతరం మాజీ మంత్రి పేర్ని నానిని కొట్టు సత్యనారాయణ మర్యాదపూర్వకంగా కలిశారు. ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్, వైస్ ఎంపీపీలు కట్టా రంగబాబు, సూర్పని రామకృష్ణ, కొమ్ముగూడెం సొసైటీ మాజీ అధ్యక్షుడు వెలిశెట్టి నరేంద్రకుమార్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జడ్డు హరిబాబు, వ్యవసాయ సలహా మండలి మాజీ చైర్మన్ ముప్పిడి వెంకట్రామిరెడ్డి (పెద్దబ్బులు), పోలిమేరు శ్రీనివాస్, ప్రత్తి రంగయ్య, తారమట్ల శ్రీనివాస్, సిర్రాపు శాంతకుమార్ తదితరులు మాజీ మంత్రి కొట్టు వెంట ఉన్నారు.

డీఈఎల్ఈడీ ఫలితాల విడుదల
ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిధిలో డీఈఎల్ఈడీ 4వ సెమిస్టర్ పరీక్షల ఫలితాలు విడుదలయ్యాయని డీఈఓ ఎస్.అబ్రహం ఓ ప్రకటనలో తెలిపారు. మార్కుల మెమోలు బీఎస్ఈఏపీ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. రీ కౌంటింగ్ కోసం సబ్జెక్టుకు రూ. 500 చొప్పున సీఎఫ్ఎంఎస్ చలానా ద్వారా చెల్లించి దరఖాస్తుతో పాటు ఫీజు చలానా, మార్కుల మెమో, సెల్ఫ్ అడ్రెస్ కవర్‌తో నేరుగా వి.హరిబాబు, ప్రభుత్వ పరీక్షల సంచాలకుల కార్యాలయం, గొల్లపూడి, విజయవాడ చిరునామాకు ఈనెల 10వ తేదీలోపు పంపాలని తెలిపారు.

ఫీజు చెల్లింపునకు 27 వరకు గడువు
భీమవరం: రాష్ట్ర సార్వత్రిక విద్యాపీఠం (ఓపెన్ స్కూల్) ద్వారా ప్రస్తుత విద్యా సంవత్సరంలో టెన్త్, ఇంటర్మీడియెట్ కోర్సుల్లో ప్రవేశానికి ఫీజు చెల్లించడానికి ఈనెల 27 వరకు అవకాశం ఉందని డీఈఓ జి.నాగమణి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. రూ.200 అపరాధ రుసుంతో సెప్టెంబర్ 4వ తేదీ వరకు గడువు ఉందన్నారు.

ఆలయ గోపురాలకు మోక్షం
సాక్షి స్పందన




చినగోపురంపై సిమెంట్ పనులు చేస్తున్న దృశ్యం — మొక్కలు తొలగించిన పెదగోపురం

పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లులో ఆలయ గోపురాలకు మోక్షం కలిగింది. గతనెల 8న 'సాక్షి'లో ప్రచురించిన 'ప్రమాదకరంగా ఆలయ గోపురాలు' కథనానికి దేవదాయశాఖ అధికారులు స్పందించారు. క్షీరా రామలింగేశ్వరస్వామి (పెదగోపురం), చతుర్భుజ లక్ష్మీతాయార్లు సమేత జనార్దనస్వామి (చినగోపురం) ఆలయ గోపురాలపై మొక్కలు పెరిగి పెచ్చులు ఊడి పడిపోతుండటంపై 'సాక్షి' కథనాన్ని ప్రచురించింది. ముఖ్యంగా చినగోపురంపై మొక్కలు పెద్దవిగా పెరిగిపోయి పెచ్చులు ఊడి పడిపోతుండటంతో అధికారులు గోపురానికి తాత్కాలికంగా వల కట్టి వదిలేశారు. దీంతో భక్తులు, స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ఆయా సమస్యలను ప్రస్తావించగా.. అధికారులు స్పందించి పెదగోపురంపై ఉన్న మొక్కలను తొలగించడంతో పాటు చినగోపురంపై ఉన్న మొక్కలను తొలగించి సిమెంట్ పనులు చేస్తున్నారు. దీనిపై పట్టణవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రెవెన్యూ సిబ్బందికి ప్రాక్టికల్స్


ప్రాక్టికల్స్ పరీక్ష నిర్వహిస్తున్న జిల్లా సర్వే, భూరికార్డుల అధికారి జాషువా


సాక్షి, భీమవరం: భూసర్వేకు సంబంధించి రెవెన్యూ ఉద్యోగులకు శుక్రవారం స్థానిక కలెక్టరేట్ వద్ద ప్రాక్టికల్స్ పరీక్షలు నిర్వహించారు. 17 మంది ఉద్యోగులు హాజరై తమ నైపుణ్యాన్ని ప్రదర్శించారు. ఈనెల 11న విజయవాడలో రాత పరీక్ష జరుగనుంది. రెవెన్యూ విభాగంలోని జూనియర్ అసిస్టెంట్లు, వీఆర్వోలకు భూ సర్వే, రెవెన్యూ చట్టాలపై అవగాహన కల్పించేందుకు, విధి నిర్వహణలో నైపుణ్యాన్ని పెంపొందించడంతో పాటు వారి పదోన్నతుల కోసం పరీక్షలు నిర్వహిస్తుంటారు. దీనిలో భాగంగా జిల్లా సర్వే, భూ రికార్డుల అధికారి కె.జాషువా ఆధ్వర్యంలో జిల్లాలోని 17 మంది రెవెన్యూ సిబ్బందికి శిక్షణ తరగతులు జరిగాయి. సంప్రదాయ పద్ధతుల్లో గొలుసు క్రాస్టాఫ్‌తో పాటు ఎలక్ట్రిక్ టోటల్ స్టేషన్ (ఈటీఎస్), రోవర్ పరికరం ద్వారా సర్వేపై వివరించారు. రెవెన్యూ చట్టంలోని నిబంధనలు, పాలనలో ఇబ్బందులు, భూ తగాదాలు, పరిష్కార అంశాలపై అవగాహన కల్పించారు. ఎన్నికల అనంతరం మరలా శిక్షణ ఇచ్చి ప్రాక్టికల్స్ పరీక్షలు నిర్వహించారు. ఆర్‌అండ్‌బీ ఈఈ లోకేష్ పరీక్షకు ప్రత్యేక అధికారిగా వ్యవహరించగా డిప్యూటీ ఇన్‌స్పెక్టర్లు, సర్వేయర్లు పర్యవేక్షించారు. ప్రస్తుతం ప్రాక్టికల్స్‌కు హాజరైన 17 మంది ఉద్యోగులతో పాటు గతంలో ప్రాక్టికల్స్ పాసై రాత పరీక్ష ఫెయిల్ అయిన 37 మంది ఉద్యోగులకు ఈనెల 11వ తేదీన రాత పరీక్ష జరుగనున్నట్టు జాషువా తెలిపారు. ఈ పరీక్షలో పాసైన వీఆర్వో, జూనియర్ అసిస్టెంట్లకు సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతులు లభిస్తాయన్నారు.

డ్రెయిన్ల ప్రక్షాళనకు చర్యలు


భీమవరం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం: జిల్లాలోని డ్రెయిన్లలో రూ.5.92 కోట్ల వ్యయంతో చేపట్టిన 35 తూడు తొలగింపు పనులను విమర్శలకు తావులేకుండా చేపట్టాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో డ్రైనేజీ డివిజన్ ఇంజనీరింగ్ అధికారులతో ఆమె సమావేశమై తూడు తొలగింపు పనులపై సమీక్షించారు. ఏ ప్రాంతంలో ఏ రోజు పనులు చేపడుతున్నదీ ముందుగానే ఆ ప్రాంత రైతులు, ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వాలన్నారు. అలాగే 64 పూడికతీత పనులకు రూ.3.02 కోట్లు ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపామన్నారు. గునుపూడి సౌత్ డ్రెయిన్ కారణంగా తాడేరు చుట్టుపక్కల ప్రాంతాల్లో సుమారు 200 ఎకరాల మేర నీరు చేరుతుందని, పాలిమేరతిప్ప మీడియం డ్రెయిన్ కారణంగా బ్యాక్ వాటర్‌తో సుమారు 500 ఎకరాల్లో ముంపు, ఉప్పుటేరు-చిన్న కాపవరం వద్ద ఉప్పుటేరు ప్రారంభంలో నీటి ప్రవాహానికి కిక్కిస అడ్డు తగులుతుందని అన్నారు. ఆకివీడులోని దుంపగడప వద్ద రైల్వే లైన్ కింద నిర్మించిన కల్వర్టులో పైపులు, మట్టి దిబ్బ తొలగించకపోవడంతో నీటి ప్రవాహానికి ఇబ్బంది కలుగుతుందని, దీనిపై రైల్వే అధికారులతో మాట్లాడాలని సూచించారు. గునుపూడి సౌత్ డ్రెయిన్, పాలిమేరతిప్ప మీడియం డ్రెయిన్, ఉప్పుటేరు కిక్కిస తొలగింపు పనులకు ప్రతిపాదనలను సమర్పించాలన్నారు. ఈఈ డ్రెయిన్స్ సుబ్రహ్మణ్యేశ్వరరావు, డీఈలు జి.వినోద్ చంద్ర, కె.వరప్రసాద్, ఏఈఈలు పి.వెంకటేశ్వరరావు, ఖాదర్ వలీ పాల్గొన్నారు.

సీఐలకు స్థానచలనం
● 41 మంది బదిలీ ● ఏలూరు రేంజ్ ఐజీ ఉత్తర్వులు



ఏలూరు టౌన్: ఏలూరు రేంజ్‌లోని ఆరు జిల్లాల పరిధిలో భారీగా సర్కిల్ ఇన్‌స్పెక్టర్ల (సీఐ)ను బదిలీ చేస్తూ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏలూరు, పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి, కృష్ణా, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో పనిచేస్తున్న 41 మంది సీఐలకు స్థానచలనం కలిగింది.

పేరు	ప్రస్తుతం	బదిలీ
ఆర్.అంకబాబు	వీఆర్, కాకినాడ	సామర్లకోట యూపీఎస్
డి.సురేష్	సామర్లకోట యూపీఎస్	వీఆర్, ఏలూరు రేంజ్
టి.క్రాంతికుమార్	జీలుగుమిల్లి	పెద్దాపురం
వై.రవికుమార్	పెద్దాపురం	వీఆర్, ఏలూరు రేంజ్
జి.చెన్నకేశవరావు	వీఆర్, ఏలూరు	తుని రూరల్
ఎస్‌వీవీఎస్ మూర్తి	తుని రూరల్	వీఆర్, ఏలూరు రేంజ్
ఎం.మోహన్‌కుమార్	వీఆర్, ఏలూరు	ముమ్మిడివరం
ఎస్.కొండయ్య	ముమ్మిడివరం	తణుకు టౌన్
సీహెచ్ విద్యాసాగర్	ఇణగుదురు	రావులపాలెం
ఎం.రామ్‌మోహన్	రావులపాలెం	వీఆర్, ఏలూరు రేంజ్
పి.విశ్వం	దిశ, ఏలూరు	కొవ్వూరు టౌన్
వి.జగదీశ్వరరావు	కొవ్వూరు టౌన్	ఆకివీడు
కేవీవీఎన్ సత్యనారాయణ	ఆకివీడు	వీఆర్, ఏలూరు రేంజ్
కె.రజనీకుమార్	సీసీఎస్-2, తూర్పు	పాలకొల్లు టౌన్
కె.మంగాదేవి	పాలకొల్లు టౌన్	తూర్పుగోదావరి
జి.శ్రీనివాస్	భీమవరం టూటౌన్	పాలకొల్లు రూరల్
కె.సతీష్	పాలకొల్లు రూరల్	వీఆర్, ఏలూరు రేంజ్
బి.యాదగిరి	వీఆర్, ఏలూరు రేంజ్	నరసాపురం టౌన్
కె.అప్పలస్వామి	నరసాపురం టౌన్	వీఆర్, ఏలూరు రేంజ్
జి.కాళీచరణ్	వీఆర్, ఏలూరు రేంజ్	భీమవరం టూటౌన్
ఎం.నాగరాజు	తణుకు టౌన్	భీమవరం వన్‌టౌన్
అడబాల శ్రీను	భీమవరం వన్‌టౌన్	వీఆర్, ఏలూరు రేంజ్
పి.కృష్ణ	వీఆర్, ఏలూరు రేంజ్	కైకలూరు టౌన్
ఎస్.వెంకటనారాయణ	డీపీటీసీ, మచిలీపట్నం	గన్నవరం ట్రాఫిక్-2
ఏఎల్ఎస్ రవికుమార్	గన్నవరం ట్రాఫిక్-2	వీఆర్, ఏలూరు రేంజ్
డీఎస్ చైతన్యకృష్ణ	కాకినాడ ట్రాఫిక్-2	కాకినాడ రూరల్
కె.శ్రీనివాస్	కాకినాడ రూరల్	వీఆర్, ఏలూరు రేంజ్
బొక్కా పెద్దిరాజు	వీఆర్, ఏలూరు రేంజ్	సర్పవరం
వైఆర్‌కే శ్రీనివాస్	సర్పవరం	వీఆర్, ఏలూరు రేంజ్
జి.మధుబాబు	పోలవరం	రాజమహేంద్రవరం-3
ఎస్‌పీ వీరయ్యగౌడ్	రాజమహేంద్రవరం-3	వీఆర్ ఏలూరు రేంజ్
కె.విజయబాబు	సీసీఎస్-1, రాజమండ్రి	కొవ్వూరు రూరల్
పి.శ్రీనివాసరావు	కొవ్వూరు రూరల్	వీఆర్, ఏలూరు రేంజ్
జె.మురళీకృష్ణ	వీఆర్, ఏలూరు రేంజ్	కంకిపాడు
వి.శ్రీనివాసరావు	కంకిపాడు	వీఆర్, ఏలూరు రేంజ్
టీవీవీ రామారావు	పెనుమలూరు	ఉయ్యూరు టౌన్
ఎండీ హమీద్ బాషా	ఉయ్యూరు టౌన్	వీఆర్, ఏలూరు రేంజ్
ఎస్ఎల్ఆర్ సోమేశ్వరరావు	పీసీఆర్, మచిలీపట్నం	గుడివాడ రూరల్
కె.యేసుబాబు	గుడివాడ రూరల్	వీఆర్, ఏలూరు రేంజ్
వి.పెద్దిరాజు	గన్నవరం ట్రాఫిక్	గుడివాడ టూటౌన్
ఎం.నాగదుర్గారావు	గుడివాడ టూటౌన్	వీఆర్, ఏలూరు రేంజ్

క్లుప్తంగా

సామాజిక అంశాలపై షార్ట్ ఫిల్మ్ పోటీ



షార్ట్‌ఫిల్మ్ కాంపిటీషన్‌పై పోస్టర్

ఏలూరు టౌన్ : ఏలూరు జిల్లాలోని విద్యార్థులను సామాజిక అంశాలపై చైతన్యవంతులను చేసేందుకు జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప శివకిషోర్ నడుం బిగించారు. మహిళలపై నేరాలు, బాలల రక్షణ, సైబర్‌క్రైమ్, రోడ్ సేఫ్టీపై విద్యార్థులకు అవగాహనకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థులకు షార్ట్‌ఫిల్మ్ పోటీలు ఏర్పాటు చేశారు. ఒకటి లేదా రెండు నిమిషాల నిడివిలో ఉండే షార్ట్‌ఫిల్మ్‌లు రూపొందించి, ఈ నెల 13 లోపు 9948890429 నెంబరుకు వీడియోలు పంపాలి. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు మొదటి బహుమతిగా రూ.10 వేలు, రెండో బహుమతిగా రూ.5 వేలు, మూడో బహుమతి రూ.3 వేలు అందజేస్తారు.

ఖైదీల కుటుంబ సభ్యులకు ఉచిత న్యాయ సహాయం



ఏలూరు జిల్లా కారాగారంలో భోజన నాణ్యత స్వయంగా పరిశీలిస్తున్న న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్

ఏలూరు (టూటౌన్): ఖైదీల కుటుంబ సభ్యులకు సమస్యలు ఎదురైతే జిల్లా న్యాయసేవాధికార సంస్థను సంప్రదించాలని అవసరమైన వారికి ఉచిత న్యాయ సాయం అందజేస్తామని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ తెలిపారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు రత్నప్రసాద్ శుక్రవారం స్థానిక జిల్లా కారాగారాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కారాగారంలోని ఖైదీలకు అందిస్తున్న ఆహారం, నీరు, వైద్య సౌకర్యాలు అడిగి తెలుసుకున్నారు. ఖైదీలకు అందజేస్తున్న ఆహార పదార్థాలు స్వయంగా రుచి చూశారు. ముద్దాయిలకు లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం ద్వారా ఉచితంగా కేసులు వాదిస్తారని చెప్పారు. సెప్టెంబరు 14న ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నారని రాజీయోగ్యమైన కేసులలో ఫిర్యాదుదారులతో సంప్రదించి కేసుల పరిష్కారానికి ప్రయత్నించాల్సిందిగా సూచించారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ ఆర్‌వీ స్వామి, జైలు సిబ్బంది పాల్గొన్నారు.

11న అంబేడ్కర్ టాలెంట్ సెర్చ్ టెస్ట్

తణుకు టౌన్: ప్రతీ ఏటా అంబేడ్కర్ సాహిత్య అకాడమి ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థులకు నిర్వహించే అంబేడ్కర్ టాలెంట్ సెర్చ్ టెస్ట్‌ను ఈనెల 11వ తేదీన నిర్వహిస్తునట్లు అకాడమీ కన్వీనర్ మురాల నవీన్ కుమార్ తెలిపారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు ఈనెల 9వ తేదీలోగా తమ పేర్లను నమోదు చేయించుకోవాలని కోరారు. వివరాలకు 94934 76003, 63029 62405లో సంప్రదించాలని కోరారు.

పుస్తకాల పంపిణీలో తీవ్ర జాప్యం

- క్లాసులు ప్రారంభమైన రెండు నెలలకు పంపిణీ
- కొన్నిచోట్ల ప్రజాప్రతినిధుల కోసం వెయిటింగ్



జిల్లాలోని ఒక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు పంపిణీ చేయని పుస్తకాలు

భీమవరం: విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తామని గొప్పలు చెప్పుకున్న కూటమి ప్రభుత్వం ఆచరణలో మాత్రం చేతులెత్తేస్తోంది. విద్యా సంవత్సరం ప్రారంభమై రెండు నెలలు గడిచిపోయాక ఇప్పుడు తాపీగా ఇంటర్ విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పాఠశాల విద్యార్థులందరికీ స్కూల్ తెరచిన రోజునే పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలతోపాటు బ్యాగ్, షూస్, సాక్స్ వంటి విద్యా సామగ్రి మొత్తం పంపిణీ చేసేవారు. నేటి ప్రభుత్వం ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులకు ఆగస్టు నెలలో పాఠ్య, నోట్ పుస్తకాలు పంపిణీ చేయడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఇంటర్మీడియట్ ప్రస్తుత విద్యా సంవత్సరం జూన్ 2న ప్రారంభమైంది. జిల్లాలో 17 ప్రభుత్వ జూనియర్ కళాశాలలుండగా గత ప్రభుత్వం జెడ్పీ హైస్కూళ్ల ప్రత్యేకంగా ఏర్పాటు చేసింది. వీటిలో 16 గరల్స్ కళాశాలలు, 9 కో ఎడ్యుకేషన్ కళాశాలలున్నాయి. వాటిలో దాదాపు 2,684 మంది విద్యార్థులున్నారు. వారందరికీ ఉచితంగా పాఠ్య, నోట్ పుస్తకాలు అందిస్తామని ప్రభుత్వం ప్రకటించింది.

తరగతులు ప్రారంభమైన రెండు నెలలకా?

ఇంటర్ తరగతులు ఈ విద్యా సంవత్సరంలో జూన్ 2న ప్రారంభం కాగా.. ఇప్పటికే అన్ని కళాశాలల్లో క్లాసులు ప్రారంభించారు. పేద విద్యార్థులు సైతం అప్పులు చేసి తమకు అవసరమైన పాఠ్య, నోట్ పుస్తకాలు కొనుగోలు చేశారు. అధ్యాపకులు పాఠ్యాంశాలు బోధించడంతో విద్యార్థులు నోట్స్ పుస్తకాల్లో నమోదు చేసుకుంటున్నారు. క్లాసులు ప్రారంభమైన రెండు నెలలకు పుస్తకాలు పంపిణీ ఏమిటని? విద్యార్థులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. కేవలం ప్రభుత్వం తన ప్రచారానికే పుస్తకాలు పంపిణీ చేస్తుందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గతంలో ఇంటర్ విద్యార్థులకు టీటీడీ బోర్డు, హైదరాబాద్‌కు చెందిన ప్రైవేటు విద్యాసంస్థ ఉచితంగా పుస్తకాలు పంపిణీ చేయగా హైదరాబాద్‌కు చెందిన విద్యాసంస్థ రాష్ట్రం విడిపోవడంతో ఉచిత పుస్తకాల పంపిణీ కేవలం తెలంగాణ రాష్ట్రానికి పరిమితం చేసింది.

నేటికీ పంపిణీ కాని వైనం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వం అందించే అన్ని పథకాలు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు చేతుల మీదుగా పంపిణీ చేస్తూ భారీ ప్రచారం చేసుకుంటున్న నేపథ్యంలో ఇంటర్ పుస్తకాల పంపిణీ కూడా అధికార కూటమి నాయకులతో చేయించపోతే ఎలాంటి ఇబ్బందులు వస్తాయోననే భయంతో కళాశాలల అధ్యాపకులు వారికోసం వేచిచూస్తున్నారు. కొంతమంది ప్రిన్సిపాళ్లు పుస్తకాల పంపిణీకి రావాలంటూ స్థానిక నాయకులను కోరడంతో తమకు ఖాళీ ఉన్నప్పుడు చెబుతామని బదులివ్వడంతో ఇంటర్ పుస్తకాలు బుధవారం కళాశాలలకు చేరినప్పటికీ అనేక కళాశాలల్లో నేటికీ పంపిణీ కాలేదని తెలిసింది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



పూళ్ల వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మిద్దే వెంకటేశ్వర్లు

భీమడోలు : జాతీయ రహదారి పూళ్ల శివారు వసంతనగర్ వద్ద గురువారం రాత్రి ఓ మోటార్ సైకిల్ కంటైనర్ లారీని ఢీకొన్న ఘటనలో తూర్పు గోదావరి జిల్లా నిడదవోలు మండలం మునిపల్లికి చెందిన మిద్దె వెంకటేశ్వర్లు(37) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు మేరకు... వెంకటేశ్వర్లు హనుమాన్ జంక్షన్‌లోని మోహన్ సింటెక్స్ లిమిటెడ్ కంపెనీలో ఫిట్టర్‌గా పని చేస్తున్నాడు. పని ముగించుకుని గ్రామానికి బైక్‌పై వెళ్తుండగా ఆగి ఉన్న కంటైనర్ లారీని వెనుక నుంచి ఢీకొట్టాడు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు ఎస్సై వై.సుధాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి గుబ్బల మంగమ్మ దర్శనాలు ప్రారంభం

బుట్టాయగూడెం : భారీ వర్షాల కారణంగా నిలిచిపోయిన గుబ్బల మంగమ్మ తల్లి దర్శనాలను నేటి నుంచి తిరిగి ప్రారంభిస్తున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధి కోర్స గంగరాజు తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ ఇటీవల వర్షాల వల్ల కొండవాగులు పొంగి గుబ్బల మంగమ్మ తల్లి గుడికి వెళ్లే రహదారి పూర్తిగా దెబ్బతిన్నట్లు చెప్పారు. రహదారి మరమ్మతుల పనులను పూర్తి చేశామని తెలిపారు. ప్రస్తుతం వర్షాలు తగ్గడంతో భక్తులు అమ్మవారిని దర్శించుకునే అవకాశం కల్పిస్తున్నామని చెప్పారు.

కుక్కల దాడిలో గేదె మృతి

ఆగిరిపల్లి : వీధి కుక్కల దాడిలో గేదె మృతి చెందింది. మరొకటి తీవ్రంగా గాయపడింది. ఆగిరిపల్లికి చెందిన చనుమోలు బాబురావు గురువారం రాత్రి తన రెండు గేదెలను గంగానమ్మ గుంట వద్ద తోటలో కట్టేసి వెళ్ళాడు. రాత్రి వీధి కుక్కలు గుంపుగా రెండు గేదెలపై దాడి చేసి ఒక గేదెను చంపివేసాయి. రూ.లక్ష విలువైన గేదె మృతి చెందిందని బాధితుడు వాపోతున్నాడు.

అడుగుకో గుంత.. ప్రయాణం చింత

- భారీ వర్షాలకు దెబ్బతిన్న రోడ్లు
- జిల్లాలో రోడ్ల మరమ్మతులకు రూ.140 కోట్లు అవసరం



భీమవరం మండలం రామాయణపురం రోడ్డు దుస్థితి

భీమవరం : జిల్లాలోని ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ రోడ్లు అధ్వానంగా మారడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనీసం గోతులు పూడ్చడానికైనా ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడంతో జనం మండిపడుతున్నారు. ప్రభుత్వం వద్ద సొమ్ములు లేవంటూ సన్నాయినొక్కులు నొక్కుతున్న పాలకులు రోడ్లు బాగుచేయిస్తారా? అని ప్రజలు సందేహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవలి వర్షాలకు అనేక రోడ్లు గోతులు పడ్డాయి. వర్షం నీరు గోతుల్లో నిలిచిపోవడంతో వాహనదారులు గోతుల్లో పడి ఆసుపత్రి పాలైన సంఘటనలు అనేకం. జిల్లా వ్యాప్తంగా 51 ఆర్అండ్‌బీ రోడ్లు దెబ్బతిన్నట్లు ఆ శాఖాధికారులు గుర్తించారు. మరమ్మతులకు దాదాపు రూ.140 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా.

రోడ్లపై నిలిచిపోతున్న ఆర్టీసీ బస్సులు

రోడ్లు సక్రమంగా లేకపోవడంతో అనేకచోట్ల ఆర్టీసీ బస్‌లు చక్రాలు ఊడి మార్గం మధ్యంలోనే నిలిచిపోతున్నాయి. పెద్ద పెద్ద గోతుల్లోనుంచే వెళ్లాల్సిరావడంతో కుదుపులకు ప్రయాణికుల అవస్థలు వర్ణనాతీతం. బస్సుల కమాన్‌కట్టలు ఇరిగిపోవడం, విద్యుత్ కనెక్షన్లు దెబ్బతిని లైట్లు వెలగకపోవడం వంటి ఇబ్బందులతో అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని ఉద్యోగం చేయాల్సివస్తుందని డ్రైవర్స్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బాటసారులపై బురద

పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లోని రోడ్లు అధ్వానంగా మారడంతో రోడ్డుపై ప్రయాణమంటేనే హడలిపోతున్నారు. గోతుల్లో వర్షం నీరు నిలిచిపోయి బురదపేరుకుపోవడంతో బస్‌లు, లారీలు, కార్లు, ఆటోలు వంటి వాహనాలు వెళ్లే సమయంలో పక్కనుంచి వెళ్తున్న ద్విచక్రవాహనదారులు, పాదచారులపై బురద పడుతుందని వాపోతున్నారు. వర్షం తగ్గి ఎండ వస్తే రోడ్లపై దుమ్ము లేచి ప్రయాణికులకు కళ్లలో పడడంతో ఇబ్బందులు పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ముందుకురాని ప్రభుత్వం

గతంలో రోడ్లపై పెద్ద ఎత్తున ఆందోళన చేసిన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ఇప్పుడు రోడ్ల దుస్థితిపై నోరుమెదపడంలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గోతులు పూడ్చేలా చర్యలు తీసుకుంటే కొంత ఉపశమనం కలుగుతుందంటున్నారు.

ప్రతిపాదనలు పంపించాం



వర్షాల కారణంగా దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. జిల్లా వ్యాప్తంగా 51 రోడ్లు దాదాపు 150 కిలోమీటర్ల మేర దెబ్బతిన్నాయి. తాత్కాలికంగా గోతులు పూడ్చడానికి దాదాపు రూ.9.50 కోట్లు, పూర్తి స్థాయిలో మరమ్మతులు చేయడానికి రూ.130 కోట్లు వ్యయమవుతుందని అంచనా. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాగానే పనులు చేపడతాం.

– ఎస్.లోకేశ్వరరావు, ఆర్అండ్‌బీ ఈఈ, భీమవరం

సరిహద్దు గొడవలో వ్యక్తిపై హత్యాయత్నం



కత్తితో దాడి ఘటనలో తీవ్రంగా గాయపడిన చిలపరెడ్డి సుబ్బారెడ్డి

జంగారెడ్డిగూడెం: పొలం సరిహద్దు వివాదంలో ఒక వ్యక్తిపై హత్యాయత్నం జరిగింది. ఏఎస్సై వై.మంగయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పేరంపేట గ్రామానికి చెందిన చిలపరెడ్డి సుబ్బారెడ్డికి, మాకిరెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డికి పొలం సరిహద్దు వివాదం ఉంది. కొద్ది రోజులుగా వీరి మధ్య తగాదా జరుగుతోంది. ఇద్దరూ పోలీస్‌స్టేషన్‌లో కేసులు కూడా పెట్టుకున్నారు. ఇటీవల గ్రామ పెద్దలు, బంధువులు సమస్యను సామరస్యంగా పరిష్కరించుకుందామని ఇరువర్గాలకు చెప్పారు. శుక్రవారం సుబ్బారెడ్డి గ్రామంలోని ఓ చర్చి సమీపంలో కూర్చోగా.. అక్కడికి వచ్చిన సుబ్రహ్మణ్యంరెడ్డి సరిహద్దు సమస్యను లేవనెత్తాడు. దీంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. సుబ్రహ్మణ్యంరెడ్డి తన వెంట తెచ్చుకున్న కత్తితో సుబ్బారెడ్డిపై దాడి చేశాడు. దాడిలో గాయపడిన సుబ్బారెడ్డిని స్థానికులు జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో చేర్పించారు. వివరాలు తెలుసుకున్న డీఎస్పీ యు.రవిచంద్ర, లక్కవరం ఎస్సై సుధీర్ బాబుతో కలిసి స్థానిక ఏరియా ఆసుపత్రికి వచ్చి సుబ్బారెడ్డి నుంచి ఘటనకు సంబంధించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సుబ్బారెడ్డిపై హత్యాయత్నానికి పాల్పడిన సుబ్రహ్మణ్యంరెడ్డి జంగారెడ్డిగూడెం పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయాడు.

స్నేహితురాలి కోసం..



స్నేహితురాలి వైద్య ఖర్చుల కోసం చందాలు పోగు చేస్తున్న బాలికలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): అంతవరకూ తమతో ఆడుతూ పాడుతూ తిరిగిన తమ స్నేహితురాలు ఇప్పుడు మంచంపై అచేతనంగా పడి ఉండడాన్ని తట్టుకోలేక ఆ చిన్నారులు నగరంలో ఇంటింటికీ తిరుగుతూ దాతల నుంచి సహాయం అర్థిస్తున్నారు. స్థానిక కొత్తపేట సచివాలయంలో ఏఎన్ఎంగా పని చేస్తున్న కోటం దుర్గ కుమార్తె జ్ఞానేశ్వరి ఇటీవల తీవ్ర అనారోగ్యానికి గురైంది. వైద్యులు పరీక్షించి అంతర్గత అవయవాల్లో రక్తస్రావం జరిగిందని, వెంటనే లివర్ మార్పిడి శస్త్ర చికిత్స చేయాలని ఇందుకు సుమారు రూ.30 లక్షలు ఖర్చు అవుతుందని తెలిపారు. తన కుమార్తెను బతికించుకోవడం కోసం ఆ తల్లి విశ్వప్రయత్నం చేస్తోంది. తెలిసిన వారిని, దాతలను అర్థిస్తే కొంతమంది స్పందించి ఆర్థిక సాయం అందించారు. ఆ మొత్తం శస్త్రచికిత్సకు సరిపోకపోవడంతో ఏం చేయాలో అర్థం కాలేదు. విషయం తెలుసుకున్న జ్ఞానేశ్వరి స్నేహితురాళ్లు తమ స్నేహితురాలిని బతికించుకోవడం కోసం ముందుకు కదిలారు. నగరంలోని ఇంటింటికీ తిరుగుతూ చందాలు పోగు చేస్తున్నారు. నగరంతో పాటు ఇతర ప్రాంతాలకు చెందిన దాతలు కూడా స్పందిస్తే తమ స్నేహితురాలు తమకు దక్కుతుందని వారు అర్థిస్తున్నారు. బాలిక శస్త్రచికిత్సకు ఆర్థికంగా సహకరించే దాతలు కోట దుర్గమ్మ ఫోన్‌పే నెంబర్ 9676792602 నెంబర్‌కు ఫోన్ పే చేయాలని కోరుతున్నారు. లేదా స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా శాంతినగర్ శాఖలోని కోట దుర్గమ్మ అకౌంట్ నెంబర్ 62438183008, ఐఎఫ్ఎస్‌సీ ఎస్‌బీఐఎన్‌ఓ 021781కు నగదు బదిలీ చేయాలని కోరుతున్నారు.

అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు

ద్వారకాతిరుమల : ఒక మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై జి.సతీష్ తెలిపారు. ఎస్సై తెలిపిన కథనం ప్రకారం.. మండలంలోని ఐఎస్ రాఘవాపురానికి చెందిన షేక్ అహ్మద్ ఉనిషా మధ్యవర్తిగా ఉండి, బుట్టాయిగూడెం మండలం దొరమామిడికి చెందిన షేక్ బారిమామ్‌కు, సుంకర దుర్గా ఫణీంద్ర ప్రసాద్ అనే వ్యక్తి దగ్గర రూ.6 లక్షలు అప్పుగా ఇప్పించింది. కొంత కాలం గడచిన తరువాత అహ్మద్ ఉనిషా డబ్బులు ఇవ్వాలని బారిమామ్‌ను అడిగింది. ఈ నెల 1న ఉదయం 11 గంటల సమయంలో బారిమామ్ రాఘవాపురం వచ్చి, ఉనిషా ఇంట్లోకి ప్రవేశించాడు. నన్నే డబ్బులు అడుగుతావా? అంటూ నోటికొచ్చినట్టు తిట్టి, చంపుతానని బెదిరించడమే కాకుండా, తనపట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడంటూ ఉనిషా ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

యువకుడిపై పోక్సో కేసు

ఉంగుటూరు: గొల్లగూడెంలో విద్యార్థినిని వేధించిన యువకుడిపై చేబ్రోలు పోలీసులు పోక్సో కేసు నమోదుచేశారు. గోపీనాథపట్నం కాలనీకి చెందిన ఆ యువకుడు బాలికను అటకాయించి అసభ్యకరంగా ప్రవర్తించిన విషయం తెలిసిందే. ఈ మేరకు తమకు అందిన ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై మణి కుమార్ తెలిపారు.

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఢిల్లీలో నిరసన




భీమవరం అంబేడ్కర్ సెంటర్‌లో నిరసన కార్యక్రమం దృశ్యం

భీమవరం: ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు తీర్పు ఆర్టికల్ 341కు విరుద్ధంగా ఉందని, దీనిపై న్యాయనిపుణులతో చర్చించిన అనంతరం సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ అన్నారు. శుక్రవారం భీమవరంలోని అంబేడ్కర్ సెంటర్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించి అనంతరం మాట్లాడారు. వర్గీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 8 నుంచి మూడు రోజులు పాటు ఢిల్లీలో నిరసన చేపడతామని వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు చిగురుపాటి రాజేష్, జిల్లా కార్యదర్శి చిల్లె రాజ్‌కుమార్, పిట్టా వినోద్ కుమార్, మేడిది సాయి జగన్నాథ్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ విరుద్ధం

ఎస్సీ వర్గీకరణ విషయంలో సుప్రీంకోర్టు తీర్పు రాజ్యాంగ విరుద్ధమని దళిత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందరకుమార్ అన్నారు. శుక్రవారం భీమవరం 21వ వార్డులో మాల సంఘాల జేఏసీ సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్గీకరణ చెల్లదంటూ సుప్రీంకోర్టు గతంలో తీర్పునిచ్చిందని సుందరకుమార్ గుర్తు చేశారు. సమావేశంలో దొడ్డిగర్ల గంగాధరరావు, మరపట్ల ప్రసాద్, పాలపర్తి జోనా, ఉండ్రు విల్సన్ పాల్గొన్నారు.

కొండచిలువ అధికారులకు అప్పగింత



మహదేవపట్నంలో లభ్యమైన కొండచిలువను అటవీ అధికారులకు అప్పగిస్తున్న దృశ్యం

ఉండి: మహదేవపట్నం ఎస్సీ ఏరియాలో శుక్రవారం ఉదయం సుమారు 7 అడుగుల కొండచిలువ లభ్యమైంది. స్థానికులు దాయం రవికుమార్ ఉదయం 8 గంటల సమయంలో వాలీబాల్ కోర్టు వైపు వెళ్లడంతో అక్కడ ఏర్పాటు చేసిన నెట్‌లో చిక్కుకుని వేలాడుతున్న కొండచిలువను గమనించి దానిని పట్టుకుని గ్రామ పంచాయతీ కార్యాలయం వద్దకు తీసుకువచ్చాడు. సర్పంచ్ వనిమా సుబ్బలక్ష్మీ శ్రీనివాస్, కార్యదర్శి కే పవన్‌కుమార్, వీఆర్వో ఎస్ చిన్నారావుకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి పరిశీలించిన అనంతరం భీమవరం సెక్షన్ ఫారెస్ట్ ఆఫీసర్ ఎండీ అబ్దుల్‌బారీకి సమాచారం అందించారు. సెక్షన్ ఫారెస్ట్ ఆఫీసర్ తన సిబ్బందితో మహదేవపట్నం వచ్చి కొండచిలువను స్వాధీనం చేసుకుని సురక్షిత ప్రాంతంలో వదిలారు.

తల్లి పాలు.. అమృతపు జల్లు

- జిల్లా వ్యాప్తంగా తల్లి పాల వారోత్సవాల నిర్వహణ
- గ్రామాల్లో అవగాహన ర్యాలీలు, సదస్సులు



భీమవరం మండలం రామాయణపురం రోడ్డు దుస్థితి

భీమడోలు: తల్లి పాలు బిడ్డకు అమృతంతో సమానం. తల్లి పాల విశిష్టతను చాటి చెప్పేందుకు ప్రతి ఏటా ఆగస్టు ఒకటి నుంచి ఏడో తేదీ వరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రపంచ తల్లి పాల వారోత్సవాలు ఘనంగా నిర్వహిస్తోంది. నేడు సౌందర్యం తగ్గుతుందని కొందరు, ఇతర కారణాలతో పుట్టిన నెల రోజులకే పోత పాలు పట్టిస్తున్నారు. కొందరు మూఢ నమ్మకాలతో పుట్టిన రెండు, మూడు రోజుల వరకూ తల్లిపాలను ఇవ్వడం లేదు. ఈ నేపథ్యంలో బిడ్డకు తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన, చైతన్యం కలిగించేందుకు మాతా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వాడ వాడలా ర్యాలీలు, సదస్సులు నిర్వహిస్తోంది. ఇంటింటికీ వెళ్లి అంగన్‌వాడీ, వైద్య ఆరోగ్య శాఖలు మాతా శిశు మరణాలు గణనీయంగా తగ్గించేందుకు సంపూర్ణ ఆరోగ్యానికి తల్లి పాలే శ్రేయస్కరమని ప్రచారం చేస్తున్నాయి.

తల్లి పాలలో ఖనిజాలు, మాంసకృత్తులు, ప్రొటీన్లు, విటమిన్లు పుష్కలంగా ఉంటాయి. ముర్రిపాలు బిడ్డకు వ్యాధి నిరోధక టీకాగా పని చేస్తుంది. కామెర్లు, టైఫాయిడ్, మలేరియా వంటి ప్రాణాంతక రోగాలు దరికి చేరవు. బిడ్డ బరువు పెరిగేందుకు తల్లి పాలు దోహద పడతాయి. పగలు కన్నా రాత్రి సమయంలో పాలు ఇవ్వడం ద్వారా బిడ్డ ఎదుగుదల బాగుంటుంది. బిడ్డకు బుద్ధి మాంద్యం, మానసిక రుగ్మతలు దరిచేరే అవకాశాలు తక్కువ. పుట్టిన బిడ్డకు గంటలోపు ముర్రుపాలు ఇవ్వాలి. ప్రారంభంలో రోజుకు 8 నుంచి 12 సార్లు శిశువుకు రొమ్ములపై చనుబాలివ్వడానికి అనుమతించాలి. ఒక రొమ్ములో పాలు పూర్తయిన తర్వాతనే మరో రొమ్ముకు మార్చాలి.

ఆరునెలల పాటు తల్లి బిడ్డకు పాలు ఇవ్వడం ద్వారా ఆరు నెలల లోపు గర్భం దాల్చే అవకాశం ఉండదు. ఇది సహజ కుటుంబం నియంత్రణ పద్ధతిగా దోహద పడుతుంది. రొమ్ము, గర్భసంచి, అండాశయం క్యాన్సర్లు వచ్చే అవకాశం తక్కువ. ప్రసవ సమయంలో స్థిరత్వం కోల్పోయిన గర్భసంచి పూర్వ స్థితికి చేరుకుంటుంది. రోగనిరోధక శక్తి పెరిగి రెండేళ్ల వరకు మెదడు ఎదుగుదల ఉంటుంది. తల్లి పాలు తాగిన శిశువుల్లో యాంటీబాటీస్ వృద్ధి చెంది ఇన్ఫెక్షన్లు, న్యుమోనియా, డయేరియా వంటివి సోకకుండా నివారించవచ్చు. శిశువు మొట్టమొదట విసర్జించే నల్లటి మెకోనియం అనే మలంతో పాటు పచ్చ కామెర్లు కలిగించే బెలురూబిన్ అనే పదార్థాన్ని కూడా త్వరగా విసర్జించేలా ముర్రుపాలు దోహదం చేస్తాయి. బిడ్డకు మొదటి వారంలో పచ్చకామెర్లను నివారిస్తాయి.

శారీరక, మానసిక ఆరోగ్యానికి మంచిది



తల్లి పాలే బిడ్డకు శ్రీరామ రక్ష. ఆరు నెలల పాటు విధిగా తల్లి పాలను పట్టించాలి. గ్రామస్థాయిలో అంగన్‌వాడీ సిబ్బంది ద్వారా గర్భిణులు, బాలింతలకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాం. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తల్లి పాల వారోత్సవాల ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించి చైతన్యవంతులు చేస్తున్నాం.

కేపీవీఎల్ పద్మావతి, ప్రాజెక్టు డైరెక్టర్, ఐసీడీఎస్, ఏలూరు

క్లుప్తంగా

ప్రతి శుక్రవారం డ్రై డే నిర్వహించాలి



కరపత్రాలను పంపిణీ చేస్తున్న డాక్టర్ డి.మహేశ్వరరావు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రజలంద రు ప్రతి శుక్రవారం డ్రై డే నిర్వహించే విధంగా సహక రించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ డి.మహేశ్వరరావు అన్నారు. పట్టణంలో శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమాల అమలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. యాగర్లపల్లిలోని పట్టణ ఆరోగ్య కేంద్ర పరిధిలోని 24, 25 వార్డుల్లో నిర్వహించిన అవగాహన కార్యక్ర మాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేశ్వ రరావు మాట్లాడుతూ ప్రజలందరూ నివాస ప్రాంతాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకో వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ మలేరియా అధికారి పి.శ్రీనివాస రావు, మలేరియా సబ్ యూనిట్ హెల్త్ అధికారి వై.వి.లక్ష్మణరావు, ఆరోగ్య కార్యక ర్తలు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

శాకంబరి అలంకరణలో వేల్పూరు మహాలక్ష్మమ్మ



శాకంబరి అలంకరణలో మహాలక్ష్మీ అమ్మవారు

తణుకు టౌన్: మండలంలోని వేల్పూ రు గ్రామంలో శ్రీ రుద్రేశ్వర భద్ర కాళీ, మహాలక్ష్మీ అమ్మవార్ల ఆలయంలో ఆషాఢం మాసం సందర్భంగా ఆలయంలోని మహాలక్ష్మీ, పార్వతీ దేవి అమ్మవార్లను శాకంబరి అలంకరణలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ దంపతులు ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలతో పాటు ఆలయ ఈవో పీ సూర్యనారాయణ పాల్గొన్నారు.

పంట నష్టం అంచనాలను త్వరితగతిన రూపొందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో బీఎస్ఎన్.రెడ్డి

తాడేపల్లిగూడెం రూరల్: పంట నష్టం అంచనాలను త్వరిగతిన రూపొందించాలని, ఈ నెల 4వ తేది నాటికి రిపోర్టులు అందజేయాలని తాడేపల్లిగూడెం ఇన్ఛార్జ్ ఆర్డీవో బీఎస్ఎన్.రెడ్డి సూచించారు. శుక్రవారం తాడేపల్లిగూడెం ఆర్డీవో కార్యాలయంలో డివిజన్లోని తహసీల్దార్లు, ఏడీఏలు, ఏవోలు, వీఆర్వోలతో పంట నష్టంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్ఛార్జ్ ఆర్డీవో రెడ్డి మాట్లాడుతూ ఈ నెల 5 నుంచి 9వ తేది వరకు ఆయా పంచాయతీ కార్యాలయాల వద్ద అభ్యంతరాలు స్వీకరించనున్నట్టు తెలిపారు. రైతులు ఈ విషయాన్ని గుర్తించి, జాబితాలో తమ పేరు ఉన్నది ? లేనిది ? సరి చూసుకోవాలన్నారు. ఏదైనా చేర్పులు, మార్పులు ఉంటే వెంటనే తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఏలు పి.మురళీకృష్ణ, రమేష్, హరిప్రసాద్, ఏవోలు ఆర్ఎస్.ప్రసాద్, పార్థసారధి, వీఆర్వోలు పాల్గొన్నారు.

పింగళి వెంకయ్యకు నివాళి

తణుకు టౌన్: జాతీయ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్య 148 జయంతి కార్యక్రమం శుక్రవారం వివిధ రాజకీయ నాయకులు, ప్రభుత్వ పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. పలువురు వెంకయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వెంకయ్య జీవిత విశేషాలను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ ఉపాధ్యక్షుడు రాసాబత్తుల అనుకుమార్, శశి విద్యా సంస్థల తణుకు క్యాంపస్ ఇన్చార్జి నిమ్మగడ్డ రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అటకెక్కిన పాలిథిన్ నిషేధం

- ఎక్కడికక్కడే యథేచ్ఛగా వినియోగం
- ఎక్కడ చూసినా గుట్టలుగా దర్శనమిస్తున్న వైనం
- పర్యావరణానికి పొంచి ఉన్న ముప్పు



దుకాణాలు వద్ద ప్లాస్టిక్ను పట్టుకుంటున్న మునిసిపల్ సిబ్బంది, సచివాలయం సిబ్బంది (ఫైల్)

తాడేపల్లిగూడెం (టీఓసీ): జీవకోటి మనుగడకు ముప్పు తెచ్చే ప్లాస్టిక్ వినియోగం రోజురోజుకూ పెరుగుతోంది. వాటి నిర్మూలనకు గతంలో అధికారులు చర్యలు చేపట్టినప్పటికీ కథ మళ్లీ మొదటికొచ్చింది. ప్లాస్టిక్ నిషేదం ప్రస్తుతం ఎక్కడా అమలుకు నోచుకోవడం లేదు. ప్లాస్టిక్ వస్తువులను, సంచులను మార్కెట్లో విచ్చలవిడిగా విక్రయిస్తున్నారు. వాటి వినియోగం పర్యావరణ పరిరక్షణకు పెనుభూతంగా మారింది. ఉదయం నిద్ర లేచింది మొదలు రాత్రి పడుకునే వరకూ మనం చేసే ప్రతి పనిలోనూ పాలిథిన్ వినియోగం ఉంటోంది. ఉదయం బయట నుంచి టిఫిన్, కూరగాయలు తేవాలన్నా, ఇంటికి సరుకులు తీసుకువెళ్లాలన్నా అన్నింటికీ పాలిథిన్ కవర్లనే వాడుతున్నాం. వాటి వాడకం వల్ల పర్యావరణానికి ముప్పు అని తెలిసినా మానడం లేదు. పాలిథిన్కవర్ల వాడకాన్ని ప్రభుత్వం నిషేధించినా ఎక్కడ అమలు కావడం లేదు. అప్పుడప్పుడూ అధికారులు నామమాత్రంగా తనిఖీలు నిర్వహించి చేతులు దులుపుకుంటున్నారు.

యథేచ్ఛగా విక్రయాలు

పాలిథిన్ కవర్లు, వస్తువుల విక్రయాలు నియోజకవర్గంలోని పెంటపాడు, గూడెం రూరల్, మండలాల్లో యథేచ్ఛగా సాగుతున్నాయి. నియోజకవర్గంలో రోజుకు సుమారు టన్ను వరకూ ప్లాస్టిక్ వ్యర్థాలు బయటపడుతున్నట్లు అంచనా. గతంలో 40మైక్రాన్ల కన్నా తక్కువ మందం కలిగిన పాలిథిన్ కవర్ల విక్రయాలపై గ్రామస్థాయి నుంచి నిషేదాన్ని అమలు చేశారు. వాటిని విక్రయించే వ్యాపారులకు అధికారులు నోటీసులు జారీ చేసి హడావుడి చేసి జరిమానాలు విధించారు. దీంతో వాటి వినియోగం అప్పట్లో చాలా వరకూ తగ్గింది. పాలిథిన్ సంచుల వాడకానికి బదులుగా గుడ్డ కవర్లు, వస్తువులను ఉపయోగించారు. తరువాత అధికారులు పట్టించుకోకపోవడంతో క్రమక్రమంగా ప్లాస్టిక్ కవర్లు, వస్తువుల వినియోగం ఎక్కువైంది.ప్రతి దుకాణంలోను, చికెన్ సెంటర్లలోనూ,బేకరీలు, హోటళ్లలోను, కర్రీ పాయింట్లలోనూ విందుల్లోను, బార్లవద్ద పాలిథిన్ వాడకాలు విచ్చలవిడిగా దర్శనమిస్తున్నాయి. వాటిని రోడ్లపైన, గ్రామ పరిసిర ప్రాంతాల్లో పడేస్తున్నారు. వీటి వలన అపరిశుభ్ర వాతావరణం నెలకొంటోంది. పాలిథిన్ తయారీలో ప్రమాదకరమైన పెట్రో కెమికల్స్ను వినియోగిస్తారు.

నీటి మట్టాలు పడిపోయే అవకాశం

ఆవులు, మేకలు, ఎద్దులు పాలిథిన్ కవర్లుతిని మృత్యువాత పడుతున్నాయని రైతులు వాపోతున్నారు.



ప్లాస్టిక్ క్యారీ బ్యాగ్లను దుకాణం వద్ద పట్టుకుని తూకం తూస్తున్న మునిసిపల్ సిబ్బంది (ఫైల్)



పట్టణంలో హోల్ సేల్ షాపులో ప్లాస్టిక్ క్యారీ బ్యాగ్లు, గ్లాసులు

పాలిథిన్ కవర్లు భూమిలో కరగడానికి చాలా సంవత్సరాలు పడుతుంది. దీనివలన భూగర్భజలాలు అడుగంటే ముప్పుకూడా ఉందని పలువురు భూగర్భజల శాఖ నిపుణులు చెబుతున్నారు. గతంలో అనారోగ్య కారణాల వలన మరణించిన ఆవు పొట్టలో 40కిలోల ప్లాస్టిక్ సంచులు బయట పడిన సందర్భం అప్పట్లో సంచలనం సృష్టించింది.

క్యాన్సర్ వచ్చే ప్రమాదం

వేడి ఆహార పదార్థాలను (వేడి ఫాస్ట్ఫుడ్) ప్లాస్టిక్ సంచుల్లో తీసుకొని వెళ్లడం వల్ల పాలీ ఇథలిన్, పాలీ హిస్టరీస్ వంటి రసాయనాలు కరిగి ఆహార పదార్థాల్లో కలిసి పోతాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. దీని ద్వారా క్యాన్సర్, తదితర వ్యాధులు వస్తాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. పాలిథిన్కు బదులుగా ఇతర వస్తువులను వాడేలా ప్రజలను చైతన్యవంతులను చేయాలంటున్నారు. పర్యావరణానికి ముప్పు వాటిల్లే పాలిథిన్ విక్రయాలపై అధికారులు తనిఖీలు చేపట్టాలని, తయారీ సంస్థలపై కూడా దృష్టి సారించాలని, అప్పుడే నిషేధం సక్రమంగా అమలవుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

దాడులు విస్తృతం చేస్తున్నాం



ప్లాస్టిక్ కవర్లు తయారు చేస్తున్న, అమ్ముతున్న కేంద్రాలపై మునిసిపల్ అధికారులు విస్తృతంగా దాడులు నిర్వహిస్తున్నారు. నిషేధంపై ఉల్లంఘిస్తే జరిమానాలు విధిస్తున్నాం. పాలిథిన్కు ప్రత్యామ్నాయంగా కాగితం వస్తువులు, గుడ్డ సంచులు వాడాలని ప్రజలకు అవగాహన కల్పిస్తాం

– ఎం.గోపాలరావు, అసిస్టెంట్ కమిషనర్, తాడేపల్లిగూడెం

నిషేధాన్ని పక్కాగా అమలు చేయాలి



పాలిథిన్ నిషేధాన్ని పక్కాగా అమలు చేయాలి. వీటిని విక్రయించే వారిపై 40మైక్రాన్ల కన్నా తక్కువ మందం కలిగిన పాలిథిన్ కవర్లు తయారు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి. పాలిథిన్ వలన పర్యావరణానికి తీవ్ర నష్టం కలుగుతోంది. వాటిని వినియోగించకుండా ప్రజల్లో చైతన్యం కలిగించాలి.

– డాక్టర్ మహ్మద్ కపర్ధి, తాడేపల్లిగూడెం

ఆర్థిక సాయం అందజేత



విద్యార్థినికి చెక్కును అందజేస్తున్న తణుకు మానవత సంస్థ సభ్యులు

తణుకు టౌన్: రాజమండ్రి ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతున్న విద్యార్థినికి తణుకు మానవత సంస్థ సభ్యుడు కొర్లేపర సత్యనారాయణ రూ. 10 వేల ఆర్థిక సహాయం అందజేసినట్లు ఆసంస్థ అధ్యక్షురాలు కఠారి శారదాదేవి తెలిపారు. శుక్రవారం తణుకు రోటరీ క్లబ్లో జరిగిన కార్యక్రమంలో విద్యార్థినీ కీర్తికి రూ.10 వేల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో మానవత జిల్లా శాంతిర్యాలీ చైర్మన్ గమిని రాంబాబు, వీవీ రామకృష్ణ, కొర్లేపర సత్యనారాయణ, రమణమూర్తి, శివన్నారాయణ, సుబ్రహ్మణ్యం, ఎస్వీ సతీష్ బాబు, ఆకుల జ్యోతి,అక్కిన కాశీ విశ్వేశ్వరరావు, కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

వాసవిలో నిహారిక సందడి



వాసవీ ఇంజనీరింగ్ కళాశాలలో సినీనటి నిహారికతో ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాసు

తాడేపల్లిగూడెం: తాను నిర్మిస్తున్న ఒక సినిమా ప్రమోషన్లో భాగంగా మెగాడాటర్ కొణిదెల నిహారిక శుక్రవారం పెదతాడేపల్లిలోని వాసవీ ఇంజనీరింగ్ కళాశాలలో సందడి చేశారు. యువత ప్రధాన అంశంగా నిహారిక నిర్మిస్తున్న ఈ చిత్రానికి పట్టణంలోని సవిత్యపేటకు చెందిన యువదర్శకుడు వంశీ దర్శకత్వం వహిస్తున్నారు. వాసవీ విద్యార్థులతో కలిసి చిత్ర యూనిట్ కొంతసేపు సందడి చేశారు. ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాసు, పాలకవర్గ కార్యదర్శి చలంచర్ల సుబ్బారావు పాల్గొన్నారు.

తల్లిపాలతో సంపూర్ణ ఆరోగ్యం



తాడేపల్లిగూడెం రూరల్: పెదతాడేపల్లి గ్రామంలో తల్లిపాల వారోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



తాడేపల్లిగూడెం అర్బన్ : 25వ వార్డులో తల్లులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: పుట్టిన బిడ్డకు వెంటనే తల్లిపాలు తాగించడం వలన అనేక రోగాల నుంచి బిడ్డకు రక్షణ ఏర్పడుతుందని జగన్నాథపురం గ్రామసర్పంచ్ ఉండ్రాజవరపు చంద్రిక అన్నారు. తల్లిపాల వారోత్సవాలను శుక్రవారం మండలంలోని జగన్నాథపురం, పెదతాడేపల్లి, మెట్ట ఉప్పరగూడెం గ్రామాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిడ్డ పుట్టిన అర గంట లోపు బిడ్డకు తల్లిపాలు పట్టించాలన్నారు. తద్వారా రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. మాధవరం పీహెచ్సీ వైద్యాధికారి ఏవీ.వెంకటేష్, ఐసీడీఎస్ సూపర్వైజర్లు ఎస్తేరు రాణి, జి.బేబి, జగన్నాథపురం సచివాలయం–2 కార్యదర్శి ఫణీంద్రకుమార్, ఎంఎస్కే అరుణాదేవి, టి.సోమమ్మ, అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం అర్బన్ : శిశువుకు తల్లిపాలు అందించడం వల్ల వ్యాధి నిరోధక శక్తి పెరగడంతో పాటు ఆరోగ్య పరంగా రక్షణగా నిలుస్తుందని ఐసీడీఎస్ సీడీపీఓ టీఎల్ సరస్వతి సూచించారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా స్థానిక 25వవార్డులోని సీతారాంపేటలో అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బిడ్డకు తల్లిపాలు వలనే కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ సోమేశ్వరరావు, పి సోమ, బి చిన్నారావు, అంగన్వాడీ కేంద్ర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అత్తిలి: అప్పుడే పుట్టిన బిడ్డకు తల్లిపాలను పట్టించడం ద్వారా బిడ్డలో వ్యాధి నిరోధక శక్తిని పెంచుతాయని ఐసీడీఎస్ సూపర్వైజర్ ఎం శ్రీదేవి అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం అత్తిలి మండలం గుమ్మంపాడు గ్రామంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ తల్లులు తమ బిడ్డలకు తప్పనిసరిగా తల్లిపాలు పట్టించడం ద్వారా బిడ్డ చురుగ్గా ఉంటాడన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సంరక్షణ కార్యదర్శి వి దయామణి, ఏఎన్ఎం జి శిరీష, అంగన్వాడీ కార్యకర్తలు పి గిరిజ, బి రాజకుమారి, సహాయకురాలు ఎ దుర్గా భవానీ, ఆశా వర్కర్లు ఆర్ పార్వతి, యు సత్యవతి తదితరులు పాల్గొన్నారు.



అత్తిలి: గుమ్మంపాడులో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు

కొమ్మరలో..

బిడ్డపుట్టిన గంటలోపు ముర్రుపాలు పట్టించాలని ఐసీడీఎస్ సూపర్వైజర్ పి మహాలక్ష్మి అన్నారు. మంచిలి సెక్టార్ పరిధిలో కొమ్మర గ్రామంలో జరిగిన తల్లిపాల వారోత్సవ కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. బిడ్డకు ముర్రుపాలు పట్టించడం ద్వారా బిడ్డకు రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. మిషన్ శక్తి 100 రోజుల కార్యక్రమంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ శ్రీనివాస్, మహిళా సంరక్షణ అధికారిణి టి నాగశిల్ప, ఎంపీహెచ్ఓ ప్రసాద్, ఏఎన్ఎం సరస్వతి, అంగన్వాడీ కార్యకర్తలు రాణి, మణి, తదితరులు పాల్గొన్నారు.

తణుకు టౌన్: పిల్లల సంపూర్ణ ఆరోగ్యానికి తల్లిపాలే మూలమని తణుకు ఐసీడీఎస్ సీడీపీవో ప్రాజెక్ట్ ఆఫీసర్ బీఎంఎస్ ప్రమోద కుమారి చెప్పారు. శుక్రవారం ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా తణుకు రూరల్ మండలం వేల్పూరు సెక్టార్ పరిదిలోని డ్వాక్రా మహిళలకు నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు ఎంతో అవసరమని, దీనిని మహిళలు గుర్తించి ప్రతీ ఒక్కరూ శ్రద్ధ వహించాలని కోరారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రాల ద్వారా అమలు చేస్తున్న వివిధ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ ఎం అరుణకుమారి, అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు, గర్భిణులు తదితరులు పాల్గొన్నారు. అలాగే తణుకు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిదిలోని పైడిపర్రు సెక్టార్లో గల దువ్వ, తేతలి, కోనాల, ముద్దాపురం, కోనాల, కొమరవరం గ్రామాల్లోని అంగన్వాడీ కేంద్రాల్లో ఐసీడీఎస్ సెక్టార్ సూపర్వైజర్ సీహెచ్ వెంకట లక్ష్మీ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాల్లో తల్లిపాలపై అవగాహన కల్పించారు. తల్లిపాల ప్రాముఖ్యత గురించి మహిళలకు వివరించారు. వేల్పూరులోని అంగన్వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాలలో ఐసీడీఎస్ సూపర్వైజర్ కె కృష్ణకుమారి, అంగన్వాడీకార్యకర్తలు పాల్గొన్నారు. మండపాక గ్రామంలో రేలంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ తల్లిపాల వారోత్సవాలలో వైద్యాధికారి డాక్టర్ బంగారు రవి ముఖ్యఅతిథిగా పాల్గొని తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. ఈకార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.



తణుకు టౌన్: అంగన్వాడీ కేంద్రంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సీడీపీవో ప్రమోదకుమారి

బిడ్డకు ముర్రుపాలు తప్పనిసరిగా పట్టాలి

అత్తిలి: పుట్టిన బిడ్డకు ఆరు నెలలు వరకు తల్లిపాలను పట్టించాలని ఐసీడీఎస్ అత్తిలి సెక్టార్ సూపర్ వైజర్ కె కుమారి అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం అత్తిలి మండలం కె సముద్రపుగట్టు గ్రామంలో తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి విజయ్కుమార్, సూర్యరేఖ, ఏఎన్ఎం విజయకుమారి, అంగన్వాడీ కార్యకర్తలు దీపికారాణి, పూర్ణగిరి, నవోమి పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం (టీఓసీ): తల్లిపాలు బిడ్డకు జీవితాంతం రక్షణగా ఉంటాయని, తల్లిపాలు బిడ్డలకు సంపూర్ణ ఆరోగ్యాన్నిస్తాయని ఐసీడీఎస్ సూపర్ వైజర్ దుర్గాభవాని తెలిపారు. పట్టణంలో తల్లిపాలు వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం అంగన్వాడీ కేంద్రాల్లో అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కె.విశాలాక్షి, అంగన్వాడీ కార్యకర్తలు, వార్డు పెద్దలు పాల్గొన్నారు.





తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్రెడ్డిని మాజీ ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్కుమార్, వైస్ ఎంపీపీలు కట్టా రంగ బాబు, సూర్పని రామకృష్ణ, కొమ్ముగూడెం సొసైటీ మాజీ అధ్యక్షుడు వెలిశెట్టి నరేంద్రకుమార్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు జడ్డు హరిబాబు తదితరులు కలిశారు.

– తాడేపల్లిగూడెం రూరల్

దోమల ఆవాసాలైన సామగ్రిని తొలగించాలి



డ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఇన్చార్జ్ జిల్లా మలేరియా ఆఫీసర్ డాక్టర్ రవికుమార్

తణుకు అర్బన్: వర్షాకాలం దోమల పుట్టుకకు అనువైన కాలమని, ఇంటి పరిసరాల్లోని దోమలకు ఆవాసాలుగా ఉండే అనవసరమైన సామగ్రిని తొలగింప చేయాలని ఇన్చార్జ్ జిల్లా మలేరియా ఆఫీసర్ డాక్టర్ కేజేఎస్ రవికుమార్ అన్నారు. తణుకులో శుక్రవారం నిర్వహించిన డ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని డాక్టర్ రవికుమార్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమ పుట్టుకను నిరోధించగలిగితే వ్యాధులను నియంత్రించుకోవచ్చని స్పష్టం చేశారు. దోమల నిలయాలుగా ఉండే కొబ్బరి బొండాలు, పాత టైర్లు వంటివి తొలగింపజేయాలని, ఇంట్లోని రిఫ్రిజిరేటర్, రుబ్బురోళ్లు, మొక్కల కుండీలలో ఉండే వేస్ట్ వాటర్ను సైతం ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అర్బన్ హెల్త్ సెంటర్స్ వైద్యులు డాక్టర్ డానియల్ రాజు, డాక్టర్ పృధ్వి రాజ్, డాక్టర్ రాజా నాగభూషణం, ఫైలేరియా హెల్త్ సూపర్వైజర్ కె.సత్యనారాయణ, వార్డు హెల్త్ సెక్రటరీలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం



పట్టణంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. లయన్స్క్లబ్ అధ్యక్షుడు వీవీఎస్ లక్ష్మీ నారాయణ ఆధ్వర్యంలో శుక్రవారం పచ్చిగోళ్ళ శ్రీనివాసరావు ఆర్థిక సహకారంతో కడకట్ల జనతా చారిటబుల్ ట్రస్ట్ ఆసుపత్రిలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 94మందికి రక్తపరీక్షలు చేశారు. మేడపాటి లక్ష్మీ సత్యనారాయణ రెడ్డి, సుంకర శ్రీనివాస్, చిన్నం జగదీష్, డాక్టర్ ఎల్ ఎస్వీ నాగేశ్వరరావు వంగపండు రామ మోహన్ రావు, పచ్చా వెంకటేశ్వరరావు, పచ్చిగోళ్ళ శ్రీనివాసరావు, సీహెచ్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రత్యేక హోదాతోనే రాష్ట్రాభివృద్ధి

తణుకు: ప్రత్యేక హోదాతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యపడుతుందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి, పశ్చిమగోదావరి జిల్లా ఇన్ఛార్జి కామ్రేడ్ ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. స్థానిక సురాజ్య భవనంలో సీపీఐ పశ్చిమగోదావరి జిల్లా సమితి విస్తృత సర్వసభ్య సమావేశం జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశంలో ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లా డుతూ గత ఎన్నికల హామీలు అమలు చేయలేని ఎన్డీఏ ప్రభుత్వం ప్రభుత్వం రూ. 16 లక్షల కోట్లు కార్పొరేట్ రుణాలు మాఫీ చేసిందని గుర్తు చేశారు. భారతదేశంలో చట్టాలు, పథకాలు కమ్యూనిస్టుల కష్టాల ఫలితమేనన్నారు. ఎంతోమంది అమర వీరుల త్యాగాల చరిత్ర ఉన్న పార్టీ సీపీఐ పార్టీ అన్నారు. సీపీఐ పార్టీ నిర్మాణాలు బాగానే ఉన్నా, ప్రజలకు దగ్గర అవడంలో విఫలం చెందుతున్నామన్నారు. పార్టీ నాయకులు ప్రజా సమస్యలపై పోరాడుతూ ప్రజలకు చేరువ కావాలన్నారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ మాట్లాడుతూ భిన్నత్వంలో ఏకత్వం మన దేశం ప్రత్యేకత అని అన్నారు. దేశంలో మతోన్మాదాన్ని రెచ్చగొట్టడం ద్వారా రాజ్యాంగ స్ఫూర్తికి ప్రధాని మోదీ తూట్లు పొడుస్తున్నారని దుయ్యబట్టారు. ఈసారి పార్లమెంట్లో బలమైన ప్రతిపక్షం ఏర్పడిందని చెప్పారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి దేగా ప్రభాకర్ మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టులో నిర్వాసితుల ప్రయోజనాలకే సీపీఐ అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. రాష్ట్రంలో గంజాయి, ఎర్రచందనం స్మగ్లింగ్ ను చంద్రబాబు ఆపి చూపించాలని, ప్రజల భాగస్వామ్యంతో కార్యక్రమాన్ని రూపొందించాలని చెప్పారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు నెక్కంటి సుబ్బారావు, కలిశెట్టి వెంకట్రావు, మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి సికిలే పుష్పకుమారి, ఎం.సీతారాంప్రసాద్, చెల్లబోయిన రంగారావు, కళింగ లక్ష్మణరావు, నెక్కంటి క్రాంతికుమార్, పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు, జిల్లా సమితి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి నాగేశ్వరరావు